క్లుప్తంగా

ఎస్‌బీఐ పెన్షనర్ల సేవలు ప్రశంసనీయం



రిఫ్రిజిరేటర్ అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: స్టేట్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ చేస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్దనున్న శాంతా కల్యాణ్ అనురాగ నిలయానికి రిఫ్రిజిరేటర్, ప్రశాంతి వృద్ధాశ్రమానికి 8 మంచాలు వితరణగా పెన్షనర్లు సోమవారం అందజేశారు. దీంతో వీరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ ప్రతినిధులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు దుర్గా శ్రీనివాసరావు, సీవీఎస్‌మూర్తి, నిక్కు అప్పన్న, వైకుంతరావు, పట్నాయిక్, ఉప్పు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ టీకా దినోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని అవని స్కూల్ ఆఫ్ నర్సింగ్ సెమినార్ హాల్‌లో జాతీయ టీకా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. టీకాల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా ఆయుష్ విభాగం సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి.జగదీష్ సూచించారు. కార్యక్రమంలో అవని నర్సింగ్ స్కూల్ ఏవో బి.సునీత, ఎస్.సత్యనారాయణ, పి.విశ్వనాథం, ఎన్‌వైసీలు దిలీప్‌కుమార్, ఎం.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల విభజన రాజ్యాంగ విరుద్ధం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): షెడ్యూల్డ్ కులాల విభజన రాజ్యాంగ విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బెంజిమన్ అన్నారు. నగరంలోని ఇలిసిపురంలో ఉన్న అంబేడ్కర్ భవనంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. ఎస్సీ విభజనను అడ్డం పెట్టుకొని పాలకులు లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ అదే పంథా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలోనూ షెడ్యూల్డ్ కులాలను విడదీసి లబ్ధి పొందాలని కాంగ్రెస్, బీజేపీలు చూస్తున్నాయని దుయ్యబట్టారు. సమావేశంలో దళిత నాయకులు కె.రాజులు, కె.తవిటయ్య, డి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్‌పై అవగాహన



బలగ మున్సిపల్ స్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన

శ్రీకాకుళం క్రైమ్: జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో శక్తియాప్‌పై ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తున్నారు. నగరంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల, బలగ మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్‌ఐ వాసుదేవరావు తన టీమ్‌తో కలిసి శక్తి యాప్ ఆవశ్యకత, ఎలా వినియోగించుకోవాలో సోమవారం వివరించారు. ఆపద వచ్చినప్పుడు ఎస్‌ఓఎస్ బటన్ క్లిక్ చేస్తే 10 నిమిషాల్లో అందుబాటులో ఉంటామని, 112కు కూడా కాల్ చేయవచ్చిన సూచించారు.

పీ-4 సర్వే పరిశీలన



సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరంలోని కొత్తపేట, బాదుర్లపేట సచివాలయాల పరిధిలో జరుగుతున్న పీ-4 సర్వేను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే పీ-4 సర్వే లక్ష్యమన్నారు. ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలోని 20 శాతం అత్యంత నిరుపేదలను ఆదుకోవడం, టాప్ 10 శాతం తెలుగు ప్రవాసులు, సంపన్నుల సహకారంతో పేదరికం లేని సమాజాన్ని నిర్మించడం ఈ విధానం ముఖ్య ఉద్దేశమన్నారు.

హుండీ లెక్కింపు నేడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఫాజుల్‌బాగ్ పేటలో నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం ఉదయం 9 గంటలకు చేపట్టనున్నట్లు ఆలయ ఈవో శ్యామలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అధికారులు, వంశపారపర్య ధర్మకర్తలు, దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీ తెరవనున్నట్లు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లకు అందని భరోసా

- ఏటా రూ.15 వేలు అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి
- తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించని వైనం
- లబోదిబోమంటున్న డ్రైవర్లు



చిలకపాలెం ఆటోస్టాండ్



కూటమి మ్యానిఫెస్టోలో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీ

ఎచ్చెర్ల: ఎన్నికలకు ముందు ఒక మాట.. తర్వాత మరో మాట చెప్పడం, అన్నివర్గాలకు ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, అధికారం వచ్చిన తర్వాత వాటిని అటకెక్కించడం సీఎం చంద్రబాబునాయుడుకి పరిపాటిగా మారింది. ప్రజలను పదేపదే మోసం చేయడంలో తనకు తానే సాటి అని ప్రతీసారి నిరూపించుకుంటున్నారు. 2014లో ఆరు వందలకు పైచిలుకు హామీలు ఇచ్చి, మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. 2024లోనూ అదే రీతిలో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక తనదైన తీరులో ఎగనామం పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు, హెవీ లైసెన్స్ కలిగిన లారీ, ట్రిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, డ్రైవర్ల పిల్లలకు విద్యారుణాలు తదితర హామీలను మేనిఫెస్టోలో పేర్కొన్నారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చి పదినెలలు గడిచిపోతున్నా వీటిలో ఏ ఒక్క హామీ కార్యరూపం దాల్చలేదు. తాజాగా ప్రవేశపెట్టిన 2025–26 వార్షిక బడ్జెట్‌లో ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం పథకానికి నిధులు కేటాయించలేదు. సంక్షేమ బోర్డు, ఇతర హామీలను పరిగణలోకే తీసుకోలేదు. దీంతో ఇచ్చినమాట ప్రకారం ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం ఇవ్వాల్సిందేనని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం సాయం అందించకపోగా అధికారంలోకి వచ్చిన రోజు నుంచే రకరకాల పేర్లతో అపరాధ రుసుములు విధిస్తూ తమపై బాదుడు మొదలుపెట్టారని మండిపడుతున్నారు.

మాట నిలబెట్టుకున్న జగన్‌మోహన్‌రెడ్డి

2019కు ముందు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో ఆయనను ఆటో డ్రైవర్లు కలిసి సమస్యలు చెప్పుకున్నారు. దీంతో తాము అధికారంలోకి వస్తే సొంతంగా ఆటో ఉన్నవారితో పాటు ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు ఇస్తామని ఆయన మాట ఇచ్చారు. ఇచ్చినమాట ప్రకారం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వాహనమిత్ర పథకం పేరిట రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఐదేళ్ల పాటు ఏటా ఈ ఆర్థిక సాయం అందిస్తూ వచ్చారు. ఈ డబ్బులను ఆటో మరమ్మతులు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి వాటి కోసం ఉపయోగించుకునేవారు.

గతంలో రూ.50 వేలు అందింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు చొప్పున సాయం అందించారు. ఐదేళ్లలో రూ.50 వేలు అందుకున్నాను. ఈ డబ్బులు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, మరమ్మతులకు ఉపయోగపడేవి. ప్రస్తుత ప్రభుత్వంలో మాకు ఎలాంటి సాయం ఇంతవరకు అందలేదు.

– మజ్జి అనిల్‌కుమార్, మురపాక, ఆటో డ్రైవర్

చెప్పిన తేదీకి ఇచ్చేవారు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహన మిత్ర పథకం ద్వారా చెప్పిన తేదీకి రూ.10 వేలు ఇచ్చేవారు. కేవలం ఆటో నడుపుకుంటూ వచ్చే ఆదాయం ద్వారానే కుటుంబాన్ని పోషించుకుంటున్న మాకు ఆ డబ్బులు ఎంతగానో ఉపయోగపడేవి. కూటమి అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తామన్నారు. కానీ మాకు ఇంకా ప్రభుత్వం నుంచి సాయం అందలేదు.

– ఉంకుల ప్రసాద్, ఆటో డ్రైవర్

మోసం చేయడమే చంద్రబాబు నైజం

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: ప్రజలను నమ్మించి మోసం చేయడమే సీఎం చంద్రబాబు నైజమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకయ్యపేట గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలవుతున్నా ఇంతవరకు ఎన్నికల హామీలను అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతవరకు ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, దాడులతోనే కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజలతో కార్యకర్తలు మమేకమవ్వాలని సూచించారు. ఆయనతో పాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, సర్పంచ్‌లు మావిడి శ్రీనివాసరావు, కనకం తిరుపతిరావు, మహదాస్యం నారాయణరావు, బత్తుల చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. అనంతరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవిశెట్టి శ్రీనివాసరావు సోదరి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

పరామర్శ



ఎచ్చెర్ల: పాపారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని దేవరవలస గ్రామానికి చెందిన కె.అశోక్ ఇటీవల సముద్రపు అలలకు కొట్టుకుపోవడంతో మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు. ఆయనతో పాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తిరుమరెడ్డి గౌరీశంకరరావు, ఎంపీటీసీ సభ్యులు తిరుమలరెడ్డి లక్ష్మణరావు, జనపాల ధనుంజయరావు పకీరు, తూట అప్పలరాజు, నల్ల అప్పలరాజు తదితరులు ఉన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని గుమడాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇనపకుర్తి పాపారావు భార్య సూర్యం ఇటీవల మృతి చెందింది. దీంతో వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు ముప్పిడి శ్రీరామ్, నాగం కనకరాజు, గుండు లక్ష్మణ్, శెట్టిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథం ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: నాటు సారా రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, అందుక కావాల్సిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ 'నాటు సారా రహిత సమాజం' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, నాటు సారా సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 14405 ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ ప్రచార రథం జిల్లాలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ, నాటు సారా వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం



రణస్థలం: కాలు విరగడంతో కట్టుతో పరీక్షకు హాజరైన విద్యార్థి



శ్రీకాకుళం క్రైమ్: విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



జి.సిగడాం: కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థినులు

జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. పదో తరగతి పరీక్ష కేంద్రాల సమీపంలో పోలీసులు 144 సెక్షన్‌ను పక్కాగా అమలు చేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలోకి ఎవరినీ అనుమతించలేదు. విద్యార్థులను సైతం కేంద్రాల్లోకి ప్రవేశించేటప్పుడు నిశితంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విద్యార్థులు పరీక్షలు సరిగా రాసేందుకు తగిన జాగ్రత్తలు కుటుంబ సభ్యులు, టీచర్స్ తెలియజేశారు.

– సాక్షి నెట్‌వర్క్

తెలుగు సబ్జెక్టును నిర్వీర్యం చేస్తున్నారు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియట్ విద్యలో కూటమి సర్కారు తీసుకొస్తున్న సంస్కరణలు తెలుగు సబ్జెక్టును నిర్వీర్యం చేసేలా ఉన్నాయని తెలుగు లెక్చరర్లు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యూయేషన్ క్యాంప్ వద్ద నిరసన చేపట్టారు. ఇంటర్ విద్యలో తప్పనిసరిగా ద్వితీయ భాషగా ఉన్న తెలుగును సంస్కరణల పేరిట ఐచ్ఛిక (ఆప్షనల్)సబ్జెక్టుగా చేయడం ద్వారా భవిష్యత్‌లో తెలుగు భాష మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భాషా, సాహిత్యం ఒక జాతి సంపదని, మానవీయ విలువలు పెంపొందించి, మెరుగైన సమాజ నిర్మాణానికి తెలుగు సబ్జెక్టు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఉన్నత విద్యలో తెలుగు అవసరం లేదనే ధోరణి ఎంతమాత్రం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఇంటర్ విద్య డైరెక్టరేట్ అధికారులు వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యలో తెలుగు మీడియం కోసం పట్టుబట్టిన కూటమి పార్టీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు సబ్జెక్టునే నిర్వీర్యం చేసేలా ఆలోచనలు చేయడాన్ని తప్పుబడుతున్నారు.

28న తపాలా అదాలత్

శ్రీకాకుళం అర్బన్: విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 28వ తేదీన విశాఖపట్నం పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయంలో తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు తపాలాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కెవిడి సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్‌లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలను ఈనెల 24వ తేదీలోగా '117వ తపాలా అదాలత్' అనే శీర్షికతో ' కెవిడి సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖపట్నం–530017' అనే చిరునామాకు పంపాలని కోరారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: భారతీయ మానవ హక్కుల పరిషత్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సౌజన్య ఆధ్వర్యంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ ప్రాంగణంలో రెండురోజులుగా జరుగుతున్న రక్తదాన శిబిరం సోమవారం ముగిసిందని బ్లడ్ బ్యాంక్ మేనేజర్ డాక్టర్ టి.మణికంఠ తెలిపారు. తలసేమియా పిల్లల కోసం ఈ శిబిరం తలపెట్టినట్లు చెప్పారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు మణిశర్మ, జిల్లా అధ్యక్షురాలు జ్యోతిర్మయి, జాతీయ చైర్మన్ డాక్టర్ ప్రభు, బ్లడ్ బ్యాంకు సిబ్బంది సతీష్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

● డ్రోన్ నిఘా





జిల్లా కేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు డ్రోన్ కెమెరాతో నిఘా పెంచినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధి శాంతినగర్, బైరివానిపేట, దత్తాత్రేయ గుడి వెనుక భాగం, బలగ నాగావళి నదీ పరివాహక నిర్మానుష్య ప్రాంతాల్లో సోమవారం డ్రోన్ ఎగురవేశారు.

– శ్రీకాకుళం క్రైమ్

సత్తాచాటిన సిక్కోలు



ట్రోఫీ అందుకుంటున్న బాలికల జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా మరోసారి సత్తాచాటింది. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల వేదికగా ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు 34వ ఏపీ రాష్ట్రస్థాయి సబ్–జూనియర్స్ బాలబాలికల కబడ్డీ ఛాంపియన్‌షిప్–2025 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం బాలికల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అనంతపురంతో జరిగిన అమీతుమీ ఫైనల్ ఉత్కంఠభరిత పోరులో 37–36 పాయింట్ల తేడాతో శ్రీకాకుళం విజయదుందుభి మోగించింది. జిల్లా బాలబాలికల కబడ్డీ జట్లకు కోచ్ మేనేజర్లగా వెంకట్రావు, శ్యామ్, కోచ్‌లుగా డీఎస్‌ఏ నుంచి సింహాచలం, ఝాన్సీ వ్యవహరించి మెప్పించారు.

జాతీయ పోటీలకు ఐదుగురు ఎంపిక

కాగా త్వరలో బీహార్‌లో జరిగే జాతీయ పోటీలకు జిల్లా నుంచి రికార్డు స్థాయిలో ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలురు విభాగంలో పి.వెంకటేష్, ఎన్.గణేష్. బాలికల జట్టుకు జె.చంద్రలేఖ, జె.కవిత, ఎ.మేఘన ఎంపికయ్యారు. వీరంతా జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇదిలా ఉండగా జిల్లా కబడ్డీ జట్ల రాణింపుపై శ్రీకాకుళం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాదు ముసలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి సాదు శ్రీనివాసరావు, మెట్ట తిరుపతిరావు, డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్‌రావు, ఒలింపిక్ సంఘ నాయకులు ధర్మాన కృష్ణదాస్, ఎం.సాంబమూర్తి, పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, బీవీ రమణ, కె.మాధవరావు, సంఘ ప్రతినిధులు, కబడ్డీ కోచ్‌లు, క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు.

సకాలంలో దరఖాస్తు చేసుకోవాలి

- బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ



ఆర్.గడ్డెమ్మ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం సబ్సిడీతో కూడిన రుణాలు పొందేందుకు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. http// apobmms. apcfss. in సైట్‌లో మీ–సేవ కేంద్రాల్లో గానీ ఇంటర్నెట్ సెంటర్ లేదా సంబంధిత సచివాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు.

అర్హతలు

- లబ్ధిదారుడు బీసీ కమ్యూనిటీకి చెందిన వారై ఉండాలి. కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి.
- లబ్ధిదారుని వయోపరిమితి 21 నుంచి 60 సంవత్సరాల్లోపు ఉండాలి.
- లబ్ధిదారుడు దారిద్య్ర రేఖకు దిగువన వర్గంలో ఉండాలి.
- స్వయం ఉపాధి పథకాల్లో రవాణా రంగానికి చెందినట్లయితే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- జెనరిక్ ఫార్మసీ పథకాల కోసం డీ–ఫార్మసీ/బీ–ఫార్మసీ/ఎం–ఫార్మసీని చేసి ఉండాలి.

కావాల్సిన డాక్యుమెంట్స్

- రేషన్ కార్డు
- ఆధార్ కార్డు
- కుల ధ్రువీకరణ పత్రం
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- పాస్‌పోర్ట్ సైజు ఫొటో

మౌనమే మెహర్ బాబా సందేశం



మెహర్‌బాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్:

మౌనమే మెహర్‌బాబా సందేశమని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, సామాజికవేత్త గుడ్ల సత్యనారాయణ అన్నారు. నగరంలోని బెహరా మనోవికాస కేంద్రంలో మెహర్‌బాబా జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం అభివృద్ధికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని కమిటీ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు కొంక్యాణ వేణుగోపాల్, ఎస్.జోగినాయుడు, వాకర్స్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, గుడ్ల జగ్గారావు, డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాదరావు, డాక్టర్ ఎం.వాసుదేవ్, గోలి ఉమామహేశ్వరరావు, గేదెల లక్ష్మీ, వాసంతి, రాంబాయ్, ఎండ మోహన్ తదితరులు పాల్గొన్నారు.